క్లుప్తంగా

పౌష్టికాహారంతో గర్భిణులకు మేలు



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న శ్యామలాదీపిక

సీతమ్మధార: గర్భిణులంతా పౌష్టికాహారం తీసుకోవాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె, బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక సూచించారు. 47వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఆమె ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తున్నాయన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు చేసుకుని, మందులు వాడాలని సూచించారు. అనంతరం గర్భిణులకు శ్యామలాదీపిక సీమంతాలు నిర్వహించి సారె రూపంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రజలు సంఘటితంగా పోరాడాలి



మాట్లాడుతున్న ప్రమీల

సీతంపేట: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై ఘోర హత్యాచారం జరిగి 27 రోజులు గడిచినప్పటికీ నేరస్తులందరినీ అరెస్టు చేయలేదని పౌర చైతన్య వేదిక నాయకురాలు సి.హెచ్.ప్రమీల విమర్శించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆ హాస్పిటల్‌లో రాజకీయ నాయకులు, పోలీసులు, అధికార యంత్రాంగం, నేరస్తులు కలిపి ఒక ముఠాగా ఏర్పడి నేర సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారని, అందువల్ల దోషులు తప్పించుకు తిరుగుతున్నారని ఆరోపించారు. నేరస్తుల్లో శిక్షలు పడతాయన్న భయం లేకుండా పోయిందని, అన్ని రాజకీయ పార్టీలు నేరస్తులతో నిండిపోయాయన్నారు. ప్రభుత్వాల నుంచి మహిళలకు న్యాయం జరుగుతుందని ఆశించలేమన్నారు. ప్రజలు సంఘటితంగా పోరాడినపుడే నేరస్తులకు శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. సదస్సులో ఏయూ ప్రొఫెసర్ కోలవెన్ను, విశ్రాంత ఉపాధ్యాయుడు సత్యవతి, పౌర చైతన్య వేదిక నాయకులు ఎస్.గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన నేడు

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

మార్కెట్‌కు చవితి శోభ

- పూజా సామగ్రి విక్రయాలతో కిటకిటలాడిన బజార్లు, దుకాణాలు
- ఆకాశాన్నంటిన పూలు, పండ్ల ధరలు



వినియోగదారుల రద్దీతో అక్కయ్యపాలెం బజార్



జనంతో రద్దీగా సీతమ్మధార రైతుబజార్



అక్కయ్యపాలెంలో మట్టి ప్రతిమల విక్రయాలు



సీతమ్మధార రైతుబజార్ బయట దుకాణాల వద్ద వినియోగదారుల సందడి

సీతంపేట: వినాయక చవితి ఉత్సవాలకు నియోజకవర్గం ముస్తాబైంది. వాడవాడలా యువత చూడ ముచ్చటగా మండపాలు సిద్ధం చేశారు. పూజా సామగ్రి విక్రయాలు, కొనుగోళ్లతో మార్కెట్లు, బజార్లన్నీ వినియోగదారులతో కిటకిటలాడాయి. సీతంపేట, రామాటాకీస్, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, నరసింహనగర్ రైతుబజార్, ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద పూజా సామగ్రి, పత్రి, పువ్వులు, నేరేడు, మారేడు, జిల్లేడు, జామ, పనస, తులసి, యలమ, గరికి పత్రుల విక్రయాలు జోరుగా సాగాయి. చామంతులు, గులాబీలు, కలువపూలు, తమలపాకులు, కొబ్బరికాయలు, అరటిపండ్లు, మావిడాకుల ధరలు ఆకాశాన్నంటాయి.

జోరుగా ప్రతిమల విక్రయాలు

వినాయక చవితి పూజల కోసం మట్టి ప్రతిమల విక్రయాలు జోరుగా సాగాయి. రామాటాకీస్ జంక్షన్, సీతంపేట మెయిన్ రోడ్, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, రామచంద్రానగర్, నరసింహనగర్ ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను పెద్ద ఎత్తున విక్రయించారు. అపార్ట్‌మెంట్లు, విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలు, గృహస్తులు పెద్ద ఎత్తున విగ్రహాలు కొనుగోలు చేశారు. యువత ఊరేగింపుతో ఆటోలపై విగ్రహాలను పందిళ్లకు తరలించారు.

సీతమ్మధార రైతుబజార్ కిటకిట

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్ జనంతో కిటకిటలాడింది. వినాయక చవితి పూజా సామగ్రి విక్రయాలు జోరుగా సాగాయి. పువ్వులు, పండ్లు, కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. కిలో చామంతి(హైబ్రిడ్) రూ.400, బంతి రూ.150, గులాబీ ఎరుపు రూ.250, పసుపు రూ.250 వంతున విక్రయించారు. ఆరెంజ్ బంతి రూ.50, పసుపు బంతి దండలు రూ.50, మల్లిపూలు మూర రూ.80, కనకాంబరాలు మూర రూ.100, కాగడ మూర రూ.55 చొప్పున విక్రయాలు సాగించారు. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. బజారులో ఎటువంటి చిల్లర దొంగతనాలు జరగకుండా సిబ్బంది చర్యలు చేపట్టారు. సీతమ్మధార రైతుబజార్ బయట దుకాణాల వద్ద విక్రయాలతో సందడి నెలకొంది.

పశువులమయంగా గ్రీన్‌బెల్ట్ స్థలం



అధ్వానంగా ఉన్న గ్రీన్ బెల్టు స్థలం

సీతమ్మధార : జోన్–3 పరిధిలో పలు గ్రీన్‌బెల్టు స్థలాలు అధ్వాన్నంగా తయారవుతున్నా ఉద్యాన విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇక్కడి 24వ వార్డు రేసపువానిపాలెం సచివాలయం సమీపంలో గల గ్రీన్‌బెల్టు స్థలం ఫెన్సింగ్‌ను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అప్పటి నుంచి ఇక్కడ ఆవులు తిష్ట వేసి పచ్చదనం మాయం చేస్తున్నాయి. పచ్చదనం కోసం ఎన్నో ఏళ్ల క్రితం జాతీయ రహదారికి ఇరువైపులా గ్రీన్‌బెల్టులు ఏర్పాటు చేయడం తెలిసిందే. అయితే వాటిని కొందరు స్వార్థపరులు ఆక్రమించుకున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. అలాగే గ్రీన్‌బెల్టు స్థలాల్లో అసాంఘిక కార్యకలాపాలు కూడా జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మందు పార్టీల తర్వాత సీసాలు, గ్లాసులు, ఇతర చెత్తా చెదారం ఇక్కడే పేరుకుపోయి జుగుప్స కలిగిస్తున్నాయి. పారిశుధ్యం మచ్చుకైనా కానరాదంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికైనా జోన్–3 ఉద్యాన విభాగం అధికారులు, పబ్లిక్ వర్క్స్ ఇంజినీర్లు స్పందించి గ్రీన్‌బెల్టు స్థలంలో ఫెన్సింగ్ పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



అచ్చియ్యమ్మపేటలో దోమ లార్వాలను గుర్తిస్తున్న ఆశ వర్కర్లు, మలేరియా సిబ్బంది

అల్లిపురం: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డెంగ్యూ, మలేరియా వ్యాధులు నివారణకు పరిశరాల పరిశుభ్రత పాటించాలని అచ్చియ్యమ్మపేట సచివాలయం పరిధిలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ కేఎస్‌వీ కుమార్ ఆధ్వర్యంలో కొబ్బరితోటలో డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మూడు చెత్త బుట్టల విధానం అమలు చేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి మంచినీటి తొట్టెల్లో దోమ లార్వాలను గుర్తించి వాటిని ఒలకబోశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జి.సత్యనారాయణ, జీవీఎంసీ ఎంపీహెచ్ఏ రమేష్‌కుమార్, ఏఎన్ఎం మదీనమ్మ, సుభాషిణి, ఆశ వర్కర్ వి.శ్రీదేవి, పి.లక్ష్మి, పి.నాగలక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీల లీకుతో అవస్థలు



నక్కవానిపాలెంలో లీకవుతున్న యూజీడీ మురుగు నీరు



సీతమ్మధార రోడ్డులో యూజీడీ నుంచి లీకవుతున్న మురుగు

సీతమ్మధార : జీవీఎంసీ జోన్–3 పరిధిలో యూజీడీ వ్యవస్థ అధ్వానంగా ఉన్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. ఇక్కడి 24వ వార్డు నక్కవానిపాలెంలో యూజీడీ లీకవవడంతో రోడ్డంతా మురుగు నీటితో నిండిపోయింది. ఫలితంగా రోడ్డంతా దుర్వాసన అలుముకోవడంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు. అలాగే సీతమ్మధార కనకమహాలక్ష్మి సహకార బ్యాంకు రోడ్డులో కూడా యూజీడీ లీకవ్వడంతో స్థానికులు, వాహన చోదకులు అవస్థలు పడ్డారు. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయనందునే ఈ ప్రాంతాల్లో తరచూ యూజీడీ లీకవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఒకే వార్డులో రెండు మూడు చోట్ల యూజీడీలు లీకవడం గమనార్హం. వార్డు వలంటీర్లు, వాట్సప్ గ్రూపులు అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదులు చేయడానికి కూడా ఆస్కారం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తమవుతోంది. జోన్ పరిధిలో ఏదో ఒక వార్డులో నిత్యం యూజీడీ లీకవ్వడం సాధారణ విషయంగా మారిపోయిందంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికైనా జోన్–3 యూజీడీ విభాగం ఇంజినీర్లు స్పందించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

దేశభక్తి బృందగాన పోటీలకు ఆహ్వానం

దాబాగార్డెన్స్ : సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ, భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖ, ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించే విషయమై జాతీయ దేశ భక్తి బృందగాన పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, ప్రోగ్రామ్ కన్వీనర్ పి. వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ నెల 13న వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపాన గల ఆర్యవైశ్య యువజన సంఘం భవనం వేదికగా నిర్వహించనున్న ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఒక్కో గీతానికి 6 నుంచి 8 మంది వరకు విద్యార్థులు పాల్గొనవచ్చునితెలిపారు. విద్యార్థులు అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాల లేదా వాట్సాప్ నంబర్ల ద్వారా ఉచితంగా దరఖాస్తు స్వీకరించి పాల్గొంటున్నట్టుగా పూర్తి వివరాలతో పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆమోదముద్రతో కూడిన లేఖ అదే పాఠశాలకు దరఖాస్తులో సహా ఈ నెల 10వ తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 92466 22563, 98488 85186 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో రాష్ట్ర నాయకులు

సీతంపేట : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఏపీఎస్ఆర్‌టీసీ) జై భీమ్ అసోసియేషన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.కిరణ్ బుజ్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీఎస్ నారాయణ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షునిగా ఈ.కోటేశ్వరరావు, విశాఖ మెయిన్ డిపో అధ్యక్షునిగా ఎన్.ఎం.రావు, డిపో కార్యదర్శిగా ఎన్.చిరంజీవి, సింహాచలం డిపో నూతన అధ్యక్షుడిగా పి.వి.ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రస్తుతం ఉన్న జీవో నంబరు 70, 71 స్థానంలో 2019/1 సర్కులర్‌ను అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. అన్ని అలవెన్సులు మంజూరు చెయ్యాలని, సంస్థలో ఉన్న ఖాళీలు భర్తీ చెయ్యాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వై.రాంబాబు, వివిధ డిపోల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఎమర్జెన్సీ సినిమా విడుదలకు సహకరించాలి'



మాట్లాడుతున్న జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు

సీతమ్మధార : ప్రముఖ బాలీవుడ్ హీరోయిన్ కంగనారనౌత్ నిర్మించిన ఎమర్జెన్సీ సినిమా విడుదలకు సహకరించాలని జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు కోరారు. ఈ మేరకు ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కులో శుక్రవారం నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. ఈ సినిమాకి కేంద్ర సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇవ్వకుండా సిక్కు సంఘాలు అడ్డుకోవడం అవివేకం అన్నారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ చీకటి రోజులు ఇప్పటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతయినా వుందన్నారు. హీరోయిన్ కంగనారనౌత్ అప్పులు చేసి మరీ ఈ సినిమా నిర్మించారని ప్రశంసించారు. సెన్సార్‌బోర్డులో వున్నది భారతీయులా లేక ఖలిస్థాన్ ఉగ్రవాదాదులా అని ప్రశ్నించారు. ఈ సినిమా విడుదలయ్యే వరకు దేశంలోని మహిళాలోకం ఆమెకి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు దేవర శంకర్, సీతన్, ఎస్ఆర్‌వి జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: జాతీయ పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రా మెడికల్ కాలేజీలోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం ఇంటర్ కాలేజియేట్ క్విజ్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ వైద్య కళాశాలల నుంచి 36 బృందాలు పాల్గొన్నాయి. ఆంధ్రా మెడికల్ కాలేజీ మొదటి బహుమతి రూ.5 వేలు కై వసం చేసుకోగా, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు శ్రీకాకుళంలోని గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్ (జీఈఎంఎస్) జట్లు గెలుచుకున్నాయి. విజేతలకు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఎ.కృష్ణవేణి నాయకత్వం వహించారు.

పదోన్నతి పొందిన పోలీసులకు సీపీ సన్మానం



పదోన్నతి పొందిన సిబ్బందితో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ సిబ్బందికి ప్రమోషన్లు లభించాయి. సివిల్‌తోపాటు ఏఆర్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతులకు కలిస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో మూడో విడత ప్రమోషన్ మేళా నిర్వహించారు. సిబ్బంది సంక్షేమానికి తొలి ప్రాధాన్య ఇస్తున్న సీపీ కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరించారు. పదోన్నతి ర్యాంకులతోపాటుగా పోస్టింగ్ ఆర్డర్ అందజేశారు. మూడో విడతలో కమిషనరేట్‌కు చెందిన ఒక హెడ్ కానిస్టేబుల్‌కు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా, ఏడుగురు ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఆర్ ఎస్ఐలుగా, ఆరుగురు ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లకు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. వీరిని కుటుంబ సభ్యులతో ఆహ్వానించి సీపీ చేతుల మీదుగా ర్యాంకులు, పోస్టింగ్ ఆర్డర్లను స్వయంగా అందించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ కె.ఫక్కీరప్ప, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ ఉద్యోగి బాలసుబ్రహ్మణ్యం మృతి

మహారాణిపేట: కెనరా బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకుడు దేవరకొండ బాల సుబ్రహ్మణ్యం స్వామి గుండె నొప్పితో మృతి చెందారు. రాత్రి ఛాతీలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బాల సుబ్రహ్మణ్యం మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ప్రధాని మోదీఈ ప్రవేశ పెట్టిన ముద్ర రుణాలను చిరు వ్యాపారులకు ఇవ్వడంలో బాల సుబ్రహ్మణ్యం చురుగ్గా పని చేశారు. కెనరా బ్యాంకు ద్వారా ఎంతో మంది చిరు వ్యాపారులకు రుణాలు అందజేసిన బాల సుబ్రహ్మణ్యం మృతి తీరని లోటు అని బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ అన్నారు.

గణపతి పూజకు వేళాయె..

- ముస్తాబైన మండపాలు, పందిళ్లు
- ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో వెలసిన పందిరి

సీతమ్మధార: స్థానిక 24వ వార్డు సత్యం జంక్షన్ దరి గాంధీనగర్‌లో శ్రీ వరసిద్ధి వినాయక పూజా మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు ఇక్కడ పందిరి ఏర్పాటుచేసి 16 రోజుల పాటు ఉత్సవాలు చేయనున్నామని కమిటీ ఆర్గనైజర్ కోన గోవిందరావు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ఇక్కడ గణపతి హోమం, రుద్రహోమం, ఆయుష్షు పూజలు, జయాది హోమం, లక్ష్మీ హోమం, కుంకుమార్చనలు, హోమాలు, పూర్ణాహుతి జరుగుతాయన్నారు.

బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో..

ఇక్కడి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల ఆర్గనైజర్, బీజేపీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి పరశురామ్‌రాజు మాట్లాడుతూ 14 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈ నెల 21న అనుపు ఉత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు.

విజయాన్నందించే దుర్గాగణపతి



సీతంపేటలో విద్యుత్ దీపాలంకరణలో దుర్గాగణపతి ఆలయం



పూజలందుకోనున్న దుర్గాగణపతి

సీతంపేట : స్థానిక సీతంపేట కూడలిలో దేవదాయ శాఖ పరిధిలో గల దుర్గాగణపతి ఆలయం ఎంతో విశిష్టమైనదిగా గుర్తింపు పొందింది. ప్రతి సంవత్సరం వలే ఈ ఏడాది కూడా నవరాత్రి ఉత్సవాలకు ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఇక్కడ కొన్నేళ్ల కిందట స్థానిక యువత ఆధ్వర్యంలో విఘ్నేశ్వర యువజన సేవా సంఘం ఏర్పాటు చేశారు. సంఘం భాద్రపద మాసంలో మట్టి వినాయక విగ్రహాన్ని పెట్టి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేవారు. 1992లో దీనికి శంఖుస్థాపన చేశారు. తంజావూరు నుంచి దుర్గా గణపతి విగ్రహాన్ని తెచ్చి 1993లో ఆలయంలో ప్రతిష్ఠించారు. దుర్గా గణపతికి వెండి కవచం చేయించారు. ఆలయం దినాదినాభివృద్ధి చెంది భక్తుల సంఖ్య పెరిగింది. ఆదాయం కూడా పెరగడంతో 2009లో దేవదాయ శాఖ ఆలయాన్ని స్వాధీనం చేసుకుంది. 2022లో వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చొరవ, దాతల సహకారంతో సుమారు రూ. 50 లక్షల వ్యయంతో ఆలయాన్ని శిల్ప కళాకృతులతో అందంగా తీర్చిదిద్ది మహా సంప్రోక్ష చేశారు. ఈ ఏడాది ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి దేవదాయ శాఖతో పాటు, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దుర్గా గణపతి ఉత్సవ విగ్రహంతో కూడిన పల్లకిని మోసిన వారికి శుభం జరుగుతుందని స్థానికుల విశ్వాసం.

వెయ్యి మట్టి విగ్రహాల పంపిణీ



మట్టి వినాయక విగ్రహాలు, పత్రి అందజేస్తున్న దొరబాబు, సూర్యనారాయణ తదితరులు

సీతంపేట: వినాయక చవితి సందర్భంగా ద స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ, ఆత్మీయ కలయిక సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం నరసింహనగర్ రైతుబజార్ వద్ద మట్టి వినాయక విగ్రహాలు, పత్రి ఉచితంగా పంపిణీ చేశారు. ఆ సంస్థల అధ్యక్షుడు వై.సిహెచ్.దొరబాబు మాట్లాడుతూ నానాటికీ పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు తమ వంతు బాధ్యతగా సుమారు వెయ్యి మట్టి విగ్రహాలను అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన శ్రీవిశ్వ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ధర్మరాజు, సూర్యనారాయణ, లలిత శ్రీనివాస్, సత్యరాజు, స్వాతి, ప్రసాద్, సత్య, యామిని తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు పందిరి రాట



రాట ఉత్సవం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు గణేష్‌నగర్‌లో గల శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయం ఆవరణలో రాట మహోత్సవం ఘనంగా జరిగింది. ఇక్కడ 11 రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా చేస్తామని కమిటీ అధ్యక్షుడు టీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులకు నిత్యాన్నదానం కూడా ఏర్పాటు చేశామన్నారు. రోజూ వినాయకునికి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. ఈనెల 17వ తేదీన అనుపు మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన దాత నల్లబెల్లి వెంకటరెడ్డి, కమిటీ ప్రతినిధులు ఎంఎస్ ప్రకాశరావు, బీకే నాయుడు, కర్రి సోమిరెడ్డి, శైలుకు మారి, శ్రీదేవి, లక్ష్మి, నాగేశ్వరమ్మ, దేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సన్నాహాలు



ఫుట్‌పాత్ మీద ట్రాన్స్‌ఫార్మర్ కోసం తవ్వుతున్న సిబ్బంది

సీతమ్మధార : సీతమ్మధారలో రెండవ పెట్రోల్ బంక్ మంజూరయింది. పౌర సరఫరాల సంస్థ ఇప్పటికే సీతమ్మధార ప్రెస్‌క్లబ్ పక్కన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మరో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో ఇక్కడి బస్టాప్ సమీపంలో గల ఫుట్‌పాత్ మీద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం సిబ్బంది గోతులు తవ్వుతున్నారు. పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్న స్థలంలో ప్రస్తుతం ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ని ఇక్కడి ఫుట్‌పాత్ మీదకు తరలించనున్నారు. ఇందులో భాగంగానే ఫుట్‌పాత్ మీద గోతులు తవ్వుతున్నారు. ఇక్కడ రెండో పెట్రోల్ బంక్ వస్తే వాహన చోదకులకు మరింత సౌలభ్యంగా ఉంటుందని భావిస్తున్నారు. ప్రభుత్వమే స్వయంగా పెట్రోల్ బంక్ నిర్వహిస్తే కొలతల విషయంలో కచ్చితత్వం ఉంటుందని, కల్తీకి ఆస్కారం వుండదని ప్రజలు భావిస్తున్నారు. త్వరలోనే ఇక్కడ పెట్రోల్ బంక్ ఏర్పాటు పనులు ప్రారంభిస్తారని సమాచారం.